
“పోస్ట్!” అన్న కేకవిని, కచేరీ సావడిలో పేపరు చదువుకుంటున్న చలపతిరావుగారు లేచివెళ్ళి పోస్ట్‌మేన్ చేతిలో లెటరందుకున్నారు. ఫ్రమ్ అడ్రస్ హైదరాబాద్ అని రాసి వున్నందున... ఆదుర్దాగా కవరు చింపి చదివి, ఉత్సాహంతో “సుభద్రా!” అని భార్యని కేకేశారు.

“వస్తున్నానండీ!” అంటూ... పైట చెంగుతో చెయ్యి తుడుచుకుంటూ వచ్చి భర్త ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ, “ఎక్కడ నుంచండీ ఉత్తరం?” అంది సుభద్రమ్మ.

# ప్రేమ పూజారి

వి.రాజేశ్వరి



“నా బాల్య స్నేహితుడు కాశీపతి కొడుకు మాధవరావు ఎమ్.బి.బి.ఎస్. చదివి హైదరాబాద్‌లో డాక్టరుగా వున్నాడు. అతడికి మన రాధికను చేసుకోమని పిల్లని చూసుకోవడానికి రమ్మని లెటరు రాసేనని నీకు చెప్పాను గదా! రేపు సప్తమి, శుక్రవారం మంచిరోజని... వాళ్ళు మన రాధికను చూసుకోడానికి వస్తున్నామని రాశారు” అన్నారు చలపతిరావుగారు.

“హూఁ! వస్తే మాత్రం ఏం లాభంలేండి! మీ సుపుత్రిక కుదరనివ్వాలా ఏమన్నానా! ఇప్పటివరకు డాక్టర్లు, ఇంజనీర్లూ, ఐఎఎస్ ఆఫీసర్లు... ఎందరో పెళ్ళికొడుకులు మన పిల్ల చదువు, అందం చూసి మోజుపడి పెళ్ళిచేసుకుంటామని వచ్చారు! వచ్చిన ప్రతి పెళ్ళికొడుకునీ... మీతో ప్రత్యేకంగా మాట్లాడాలి అంటూ డాబా మీదకి తీసుకెళ్ళి ఓ అరగంట తరువాత తిరిగి వచ్చేసేది. ‘ఏమ్మా! అబ్బాయి నచ్చాడా?’ అని మీరడిగితే ‘నాకు నచ్చలే’దంటూ తిరగ్గొట్టేసేది.

“కొందరు పెళ్ళికొడుకులు కోపం వచ్చి ‘మీ పిల్లకి పెళ్ళిచూపులు పెట్టి ఇలా అందర్నీ అవమానించే కంటే పెళ్ళి చెయ్యడం మానేస్తేనే మంచిది’ అని రుసరుసలాడుతూ వెళ్ళిపోయేవారు. ఆ సంగతి మీకు మాత్రం తెలీదూ?” అంది సుభద్రమ్మ నిరుత్సాహంగా.

“అందని ద్రాక్షపళ్ళు పుల్లన అన్నట్టు, ఎవరో అలా అన్నంత మాత్రాన మన పిల్లకి పెళ్ళిచెయ్యడం



మానేస్తామా, లేక పెళ్లికాకుండా ఉండిపోతుందా? దాన్ని పెళ్లి చేసుకోడానికి ఎంతటి అదృష్టవంతుడు వస్తాడో ఎవరు చెప్పగలరు, సుభద్రా!" అన్నారు నవ్వుతూ చలపతిరావుగారు.

"నేనూ మీలాగే ఇదివరకు అనుకునేదాన్నండీ! మనమ్మాయి అందానికి కుందనపుబొమ్మ అని, చదువుకి, సంగీతానికి అపర సరస్వతి అని. కట్నకానుకలు ఇవ్వడానికి మనకేమీ లోటు లేదు. ఎన్ని లక్షలడిగినా తగిన వరుడు దొరికితే ఇవ్వడానికి సిద్ధంగానే ఉన్నాం. ఇంక మన పిల్లకి పెళ్లికావడం పెద్ద సమస్యేమీ కాదని మురిసిపోయేదాన్ని. కానీ ఇప్పుడు దాని అందం, ఆ చదువూ చూసుకునే అది అహంభావంతో ఇంత కొరకరాని కొయ్యగా తయారైందేమో అని భయంవేస్తోందండి!

"రేపు వచ్చే ఈ పెళ్లికొడుకునైనా డాబామీదకి తీసుకెళ్లి అడ్డదిడ్డమైన ప్రశ్నలు వేసి అసభ్యంగా ప్రవర్తించకుండా తిన్నగా ఉండమని దానికి చెప్పండి మీరు! ఈ కాలం ఆడపిల్లలకి కాబోయే పెళ్లి కొడుకుతో... 'ప్రత్యేకంగా మాట్లాడాలి' అనడం ఇదో ఫాషనైపోయింది! వచ్చిన ప్రతి పెళ్లికొడుకునీ డాబామీదకి తీసుకెళ్లి ఇదేమి మాట్లాడుతోందో నాకర్థం కాకుండా ఉంది!" అంది సుభద్రమ్మ.

"నీకర్థంకాదులే! మనపిల్ల వచ్చిన పెళ్లికొడుకులందరితోనూ అసభ్యంగా మాట్లాడి సంబంధాలు పాడుచేస్తోందని నువ్వనవసరంగా అపోహ పడుతున్నావు, సుభద్రా! అదేమీ అంత మూర్ఖురాలు కాదు! ఈనాడు చదువుకొని... అన్నిరంగాల్లోను ముందంజ వేస్తున్న యువతీ యువకులు... తమకు కాబోయే జీవిత భాగస్వామితో వ్యక్తిగతంగా కొన్ని విషయాలు మాట్లాడుకున్నందువల్ల... పెద్ద హానీ, అపకీర్తీ రాదు, సుభద్రా!

"తరాలు మారుతున్నకొద్దీ ఆంతర్యాలు కూడా మార్పురావడం సహజమే! అలా మనసు విప్పి ఒకరితో ఒకరు మాట్లాడుకోవడంవల్ల దాంపత్యంలో ఒకరినొకరు అర్థం చేసుకుని సుఖజీవనం గడపడానికి అవకాశం వుంటుంది. అది మంచిదే కదా!" అన్నారు చలపతిరావుగారు.

చలపతిరావుగారు విజయవాడలో సివిల్ ఇంజనీర్‌గా పనిచేసి రెండుచేతులా ఆర్జించి రిటైరయ్యారు. వారికి రాధిక, రమేష్ ఇద్దరే సంతానం. పెద్దవాడైన రమేష్ ఎమ్.బి.బిఎస్. పాసయి ఫారిన్ వెళ్లే ఛాన్సు వచ్చి అమెరికా వెళ్లిపోయాడు. ఒక ఆంగ్లో ఇండియన్ అమ్మాయిని ప్రేమించి పెళ్లిచేసుకుని డాక్టరుగా అక్కడే సెటిలైపోయాడు.

ఇంక రాధిక పెళ్లి బాధ్యత ఒక్కటే చలపతిరావుగారికి మిగిలి వుంది. రాధిక ప్రబంధ సుందరిలా పున్నమచంద్రునివంటి మోము, కలువరేకులవంటి కనుదోయి, సంపెంగ పూవంటి నాసిక, దొండపండును బోలిన అధరాలు, తుమ్మెదరెక్కలవంటి

శిరోజాలు, బంగారు కలశముల బోలు వక్షద్వయము కలిగి వచ్చని మేనిఛాయతో కుందనపుబొమ్మలా ఉంటుంది.

ఇంగ్లీషు మీడియంలో బి.కామ్ పాసయింది. సంస్కృతంలో విద్వాన్ శిరోమణి మొదలగు పరీక్షలన్నీ పాసయింది. తన కాలేజీ వార్షికోత్సవాలలో సంస్కృత నాటకాలు వేసి శృంగార నాయికగా పేరుపొంది పలుమార్లు మొదటి బహుమతులు గెలుచుకుంది. శృంగార రస సంపూర్ణమైన కావ్యాలు చదివి శృంగార రసాన్ని బాగా ఒంటబట్టించుకుంది.


నిజ జీవితంలో కూడా తనని తాను ఓ శృంగార నాయికలాగే ఊహించుకొని తన రస హృదయాన్ని అర్థంచేసుకోగల పురుషుడినే జీవిత భాగస్వామిగా ఎన్నుకోవాలని నిశ్చయించుకుంది.

అందుకే పెళ్లిచూపుల సమయంలో పెళ్లివారి ఫార్మాలిటీలన్నీ పూర్తయిపోయాక 'మీతో కొంచెం మాట్లాడాలి, అలా డాబామీదకి వస్తారా!' అని పెళ్లికొడుకుని డాబాపైకి తీసుకొని వెళ్లేది. 'నాతో ఏమి మాట్లాడాలనుకున్నారో అడగండి, రాధికా!' అని పెళ్లికొడుకు అంటే 'మరేం లేదు. శృంగారం, సరసం అంటే మీ ఉద్దేశంలో నిర్వచనం ఏమిటి? దయచేసి తెలియజేయండి' అనడిగేది.

'శృంగారం, సరసం అంటే చెప్పడానికేముంది. మొదటి రాత్రి పాలగ్లాసు చేత్తో పట్టుకొని శోభనం గదిలో ప్రవేశించిన భార్యతో కలిసి మంచంమీదకి చేరడం, ముద్దులు, కౌగలింతలు, ఆపైన జరిగేతంతు అందరికీ తెలిసిందే. వేరే చెప్పవలసిన నిర్వచనం ఏముంటుంది?' అని కొంటెగా జవాబులు చెప్పేవారు.

వాళ్ల సమాధానాలు వింటున్న రాధిక ఒళ్లు మండిపోయేది. ఇలాంటి పశువుని పెళ్లిచేసుకునే కంటే నా మనసునర్థం చేసుకోగల వరుడు లభించేవరకు వేచి ఉండడమే మంచిది అనుకుని 'నాకు నచ్చలే'దంటూ తల్లిదండ్రులకు చెప్పి, వచ్చిన సంబంధాలన్నీ తప్పించేసేది.

'రేపు శుక్రవారం హైదరాబాద్ నుండి వచ్చే పెళ్లికొడుకుని కూడా ఇదివరకు అందరు పెళ్లికొడుకుల మాదిరిగా డాబాపైకి తీసుకెళ్లి ఏవేవో మాట్లాడి ఈ సంబంధాన్ని కూడా




కొంపదీసి చెడగొట్టేస్తుందో ఏమిటో! ఇప్పటికే పిల్లకి పాతికేళ్లు వచ్చేస్తున్నాయి' అనే భయంతో బాధపడిపోతోంది సుభద్రమ్మ.

నిజమే! తాము ఎంత ధనవంతులైనా, తన కూతురు ఎంతటి సౌందర్యవతి అయినా వచ్చిన సంబంధాలన్నీ ఇలా తెలిపోతుంటే ఒక ఆడపిల్ల తల్లిగా ఆమె బాధపడటం సహజమే కదా! జాబులో రాసిన ప్రకారం శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు కాశీపతిగారు తమ కొడుకుని తీసుకొని భార్యాసమేతంగా పెళ్లిచూపులకి చలపతిరావుగారింటికి వచ్చారు.

పెళ్లిచూపుల కార్యక్రమంలో రాధికా-మాధవరావుల కనుదోయి ఒక్కక్షణం కలుసుకొని ఇరువురి హృదయాలు పులకించాయి. తృప్తినిండిన ముఖారవిందంతో కనబడుతున్న కొడుకుని చూస్తూ "మావాడికి మీ పిల్లనచ్చిపోయిందిరా చలపతీ! ఇంక మంచి రోజు చూసి ముహూర్తం పెట్టించడానికి నీదే ఆలస్యం" అన్నారు పకపకనవ్వుతూ కాశీపతిగారు.

ఆ మాట వింటున్న సుభద్రమ్మకి ఒక్కసారి వెయ్యి ఏనుగుల బలం వచ్చేసింది.

కాఫీలు, టిఫిన్లు మొదలగు లాంఛనాలన్నీ పూర్తయ్యాక "మీతో కొంచెం మాట్లాడాలి. మీ కభ్యంతరం లేకపోతే ఓసారలా డాబాపైకి వస్తారా!" అంటూ వీణ మీటినట్టు పెళ్లికొడుకుని ఉద్దేశించి పలికింది రాధిక.

"ఓ! నా కేమీ అభ్యంతరం లేదు, పదండి!" అని రాధిక వెనకాల డాబాపైకి వెళ్లాడు మాధవరావు.

ఇద్దరూ డాబాపిట్టగోడ మీద కూర్చున్నారు.

"నాతో ఏం మాట్లాడాలనుకున్నారో నిస్సంశయంగా చెప్పండి, రాధికా!" అన్నాడు మాధవరావే ముందుగా.

"శృంగారానికి, సరసానికి మీ ఉద్దేశంలో నిర్వచనం ఏమిటి?" అంది చిరునవ్వుతో రాధిక.

"నవరసాలకి రాజువంటిది శృంగారరసం. మనిషి జీవితంలో శృంగార రసం అన్నది లేకపోతే ఉప్పులేని వంటకంలాగ చప్పగా రసహీనంగా తయారవుతుంది జీవితం. మానవులు యౌవన దశలో క్రియా రూపకంగా శృంగార రసానుభూతిని పొంది భార్యాభర్తలు అన్యోన్యంగా సుఖజీవనం గడుపుతారు. వయసు మళ్లిన తరువాత తమ గతించిన మధురానుభూతులు నెమరువేసుకుని జీవన మాధుర్యాన్ని పొందుతూ శేషజీవితాన్ని తృప్తిగా ఆనందమయంగా గడపగలుగుతారు.

"ఆరోగ్యవంతమైన జీవితం కోసం అన్ని వయసులవారికీ సంజీవిని లాంటిది ఈ శృంగార రసం! అందుకే మన ప్రాచీన సంస్కృతకవులు 'అభిజ్ఞాన శాకుంతలం', 'కుమార సంభవం', 'గీతగోవిందం' మొదలగు శృంగార కావ్యాలు రచించి రసహృదయు లందరికీ చిరుకానుకగా సమర్పించారు.

"యౌవ్వనం అంకురించిన ప్రతి స్త్రీ, పురుషులు శృంగార రసానుభూతికోసం ఆరాటపడతారు. అదే సృష్టి రహస్యం! స్త్రీ-పురుష సంగమం అన్నది లేకపోతే ఈ సృష్టే నిలిచిపోతుంది.

"ఇక సరసం అంటారా? దానికి 'ఇది' అని నిర్వచనం చెప్పడం కొంచెం కష్టమే. పంచదార ఒక్కటే అయినా రకరకాల స్వీట్లు తయారుచేసుకున్నట్టుగానే శృంగార రసం



**ఆయన దృష్టి ఊర్మిళ మీదట!**

ఎవరో కాదు, ప్రముఖచిత్రకారుడు ఎం.ఎఫ్. హుసేన్ దృష్టి ఇప్పుడు రంగీలీ గర్ల్ ఊర్మిళ మీద పడిందట. మాధురీదీక్షిత్‌కు వీరాభిమానిగా వుండిన హుసేన్ గారి రెండో చాయిస్ తబ్బూ అయితే, ఇప్పటి ఎంపిక మాత్రం ఊర్మిళేనట! తబ్బూతో 'మీనాక్షి-ఎ టేల్ ఆఫ్ త్రీ సిటీస్' చిత్రం తీస్తున్న హుసేన్, ఊర్మిళతో కూడా మరో చిత్రం తీయాలని సంకల్పించాట్ట. పైగా అది మామూలు చిత్రం కాదు, కామెడీ. మరో విశేషం కూడా వుంది. ఈ చిత్రంలో ఊర్మిళ చేయబోతున్నది, మూడు విభిన్నపాత్రల్లోనట!

ఒక్కటే అయినా ఎవరి మనసుకి నచ్చే విధంగా వాళ్లు రసానుభూతి పొందడానికే సరసం అన్నది పుట్టింది. భార్యా భర్తలిరువురి హృదయాలు ఏకమైతే అనేక విధాలుగా సరసల్లాపా లాడుకోవచ్చు. అసలు ఈ సృష్టికి మూలకారణమైన శృంగార రసం వల్లనే పవిత్రమైన ఈ వివాహబంధాలు, భార్యాభర్తల అనుబంధాలు ఏర్పడతాయి.

"అంతదాకా ఎందుకు? అసలు ఎవరూ అంతగా పట్టించుకోరు గాని భక్తిరసపూరితమైన స్తోత్రాల్లోనూ, పూజావిధానాల్లోనూ కూడా కాస్త శృంగార రస సమ్మేళనం ఉంది, చూడండి, రాధికా!

"చతుర్భుజే చంద్రకళావతంసే ... కుచోన్నతే కుంకుమ రాగశ్రోణే- అంటే చతుర్భుజములు కలిగి చంద్రకళలనే సిగబంతిగా చేసుకొని ఉన్నతమైన కుచములు గల దానా... అని కాళిదాసు దేవీస్తోత్రంలో వర్ణించాడు.

"సువర్ణ కుంభయుగ్మాగ సుకుచాయైనమః అని లలితా అష్టోత్తర శతనామాలలో చెప్పబడింది.

"పద్మలయాయైనమః నాభిం పూజయామి
మదన మాత్ర్యైయనమః స్తనౌ పూజయామి

అంటే శృంగార రసాధిపతి అయిన మన్మధునికి తల్లివయి పద్మంలో నివసించిన ఓ లక్ష్మీదేవి! నీ నాభిని, స్తనాలను పూజిస్తున్నాను. అని లక్ష్మి అథాంగ పూజలో చెప్పబడింది.

శృంగార రససంపూర్ణ జయా జాలంధర స్థితాః

"అంటే శృంగార రస సంపూర్ణమైన ఓ లలితాదేవి నీకు నమస్కారం అని లలితా సహస్రనామ స్తోత్రంలో చెప్పబడింది.

అసలు స్త్రీయే శృంగార రసాధి దేవతగా సృష్టించాడు. విధాత! ఆ శృంగార రసాన్ని పోషించి ఆస్వాదించడానికే అవతరించాడు పురుషుడు. స్త్రీ శరీరంలో అణువణువూ చుంబన యోగ్యమైనవే అన్నాడు ఓ శృంగార రచయిత. శృంగార రసం గురించి ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్ని గంటలైనా సరిపోదు. శృంగారానికి, సరసానికి ఇంతకంటే ఇంకేమీ నిర్వచనం చెప్పమంటారు, రాధికా!" అన్నాడు మాధవరావు సమ్మోహనంగా చిరునవ్వులు చిందిస్తూ.

అతడు చెబుతున్న మాటలన్నీ దరహాస వదనంతో వింటున్న రాధిక- "అబ్బ! నేను శృంగారం, సరసం గురించి ఒక్క ప్రశ్న అడిగితే వంద జవాబులు వర్షం కురిపించారు. మీకు పూజల్లోను, స్తోత్రాల్లోను ఇంత పాండిత్యం ఉందంటే మీరు పూజారులా? లేక దేవీ భక్తులా?" అంది చమత్కారంగా.

"రెండూను! నేను ప్రేమ పూజారిని. ప్రణయ దేవీభక్తుణ్ని కూడాను" అన్నాడు చిలిపిగా నవ్వుతూ మాధవరావు.

అతడిని ఓరకంట చూస్తూ... "మీ శృంగార రస వర్షపుజల్లులో తడిసిపోయి, నేను మిమ్మల్ని అడగవలసిన అసలు విషయమే మర్చిపోయాను. ఇంతకీ నేను మీకు నచ్చానా?" అంది రాధిక.

"చంపేశారు. ఇంద్రలోకంలో ఉండే అప్సరస నా ఎదురుగా వచ్చి నిలబడి మీకు నేను నచ్చానా, లేదా? అనడుగుతుంటే 'నచ్చలేదు' అని చెప్పడానికి నాలో మగటిమి లేదనుకున్నారా! లేక మనుచరిత్రలో ప్రవరాఖ్యుడి శిష్యుడినను కుంటున్నారా!

"మీరు మొదటి చూపులోనే నా హృదయ కమలంలో తిష్టవేసు క్కూర్చున్నారు! ఐ లవ్ యు రాధికా!" అని నవ్వుతూ ఆమె రెండు చేతులూ అందుకుని ముద్దుపెట్టుకున్నాడు మాధవరావు.

అతడి స్పర్శకి రాధిక నవనాడుల్లోనూ తేనె ప్రవహిస్తూ తియ్యని అనుభూతితో ఆమె తనువంతా పులకించిపోయింది.

"మీరు స్త్రీ దేవతలమీద ఇన్ని స్తోత్రాల గురించి చెప్పారు గదా! మీ ప్రణయదేవతని స్తోత్రం చేస్తున్నట్టు ఓ సరసమైన శ్లోకం చెప్పకూడదా?" అంది రాధిక కొంటె చూపు చూస్తూ.

"ఊహూఁ! అదిప్పుడు చెప్పను. ఆరోజు రాత్రి... ఆ సరసమైన శ్లోకంతోనే నా ప్రణయ దేవతకి స్వాగతం పలుకుతాను" అన్నాడు. 'ఆరోజు రాత్రి' అని ఒత్తి పలుకుతూ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ మాధవరావు.

అతడి చమత్కారానికి రాధిక కపోలాల్లో గులాబీలు విరిశాయి.

చేతివాచీ చూసుకుంటూ- "మనం మాటల్లో పడి అరగంట దాటిపోయింది. వీళ్లిద్దరూ డాబామీదకి వెళ్లి ఏం చేసేస్తున్నారో అనుకుంటూ కింద మనవాళ్లంతా అనుమానాలు పడిపోతారు. ఇంక వెళదాం, పదండి!" అని నవ్వుతూ లేచింది రాధిక.

ఇద్దరూ పక్కపక్క నడుస్తూ డాబా మెట్లు దిగి వస్తుంటే రతీ మన్మధుల్లాగే 'చూడముచ్చటయిన జంట' అనుకున్నారు ఇరుపక్షాలవారూను. ఈ సంబంధం కుదిరి రాధిక పెళ్లయిపోతే వధూవరులచేత ఏడుకొండలవాడికి కళ్యాణం చేయిస్తానని మొక్కుకుంది సుభద్రమ్మ.

"ఏమ్మా! మంచిరోజు చూసి ముహూర్తం పెట్టించమంటావా రాధికా?" అన్నారు దరహాస వదనంతో చలపతిరావుగారు.

"మీ ఇష్టం నాన్నా!" అని వీణమీటినట్లు పలుకుతూ, పక్కగదిలోకి తుర్రుమంది రాధిక. ఆ మాటలు వింటున్న సుభద్రమ్మగారి హృదయం ఆనందంతో దూదిపింజెలాగ గాలిలో తేలిపోయింది.

***

లేటెస్ట్ మోడల్‌లో ఉన్న పందిరిమంచంమీద బూరుగుదూది పరుపు, పాలనురుగులాంటి తెల్లటి దుప్పటి వేసి, పాన్పుపైన ఒత్తుగా మల్లెలు పరచి, పందిరిచుట్టూ మల్లెలు, సంపెంగలు, గులాబీలు మాలలతో అందమైన డిజైన్లులా వేలాడదీసి, సినిమా సెట్టింగులా అలంకరించిన శోభనం గదిలో వెలుగుతున్న మెర్క్యురీ బల్బు పండు వెన్నెలవంటి చల్లని కాంతిని గదినిండా ప్రసరిస్తోంది. టేబిల్ మీద వెండి అగరొత్తుల స్టాండుతో వెలుగుతున్న స్పెషల్ బెడ్‌రూమ్ అగరొత్తులు గదిలో



వాతావరణాన్ని మత్తెక్కించే విధంగా పరిమళిస్తున్నాయి.

మల్లెల పాన్పుమీద 'స్వీట్ డ్రీమ్స్, గుడ్‌నైట్' అని అందంగా ప్రింటుచేయబడిన మెత్తని దిండ్లనానుకొని అలవోకగా పడుకున్న మాధవరావు, రాధిక రాకకోసం క్షణమొక యుగంలా తలుచుకుంటూ కోరికల వేడికి తట్టుకోలేక కిటికీలోంచి కనబడుతున్న నిండు పున్నమి జాబిల్లిని తిలకిస్తున్నాడు. కిటికీ పక్కగా ఉన్న సన్నజాజి లత, మాధవరావు అవస్త చూసి ఫక్కున నవ్వుతున్నట్టు పూలగుత్తులతో వెల్లివిరిసి పిల్లగాలికి తలలూపుతూ, కిటికీలోంచి సుమ సౌరభాలు గదిలోకి వెదజల్లుతూ. మాధవరావు మనసులో గిలిగింతలు పెడుతోంది. తెల్లని సిల్కుచీర కట్టుకుని, మల్లెలు, విరజాజులు, సంపెంగలు మొదలైన సుగంధ కుసుమాలతో పూలజడ అలంకరించుకుని, పెద్ద వెండిగ్లాసుతో పాలు చేత్తో పట్టుకుని మొదటిరాత్రి గురించి మధురమైన ఊహాలోకంలో తేలియాడుతూ, వయ్యారంగా, ముగ్ధమనోహరంగా, హంసనడకలతో, ప్రబంధ సుందరిలాగ శోభనం గదివైపు అడుగులు వేస్తోంది రాధిక.

అంతవరకూ రాధికతో హాస్యాలాడుతూ చెణుకులు చమత్కారాలు విసురుతూ ఆమెకు ఇరుప్రక్కలా నడుస్తున్న ఆమె చెలికత్తెలు, ముత్తైదువలు అంతా కలిసి ఆమెను శోభనం గదిలోకి సాగనంపి ఇంక మా బాధ్యత తీరిపోయిందన్నట్టు తలుపులు చేరవేసి కిలకిల నవ్వుకుంటూ నిష్క్రమించారు.

### నేనెంచుకున్న కెరీర్ ఇదే!

**మాజీ** ప్రపంచసుందరి ప్రియంకచోప్రాకు ఇంకే రంగమూ దొరకలేదా, సినిమాల్లో చేరిందని ఎవరో అడిగితే, దానికి ప్రియంక ఇలా సమాధానం చెప్పింది-"నేనసలు ప్రపంచసుందరిగా ఎంపిక కాకముందే 'హమ్‌రాజ్' చిత్రానికీ, మరో చిత్రానికీ పని చేయటానికి అంగీకరించాను. నాకు టైటిల్ వచ్చినా, రాకపోయినా నటిననవుదామనే అనుకున్నా. అయినా జనంలో మనను తాకాలనే తహతహా, తళుకుబెళుకుల గ్లామర్, లభించే ధనం, గొప్పగా జీవించే పద్ధతీ సినీరంగంలో లభ్యమవుతున్నప్పుడు కాదనే తెలివితక్కువ దాన్నేమీ కాను!"

రాధిక రాకతో ఆ గదిలో ఒక్కసారి తొలకరి మెఱుపు మెఱిసినట్టనిపించి ఆమె సౌందర్యానికి మాధవరావు తనువు పులకించిపోయింది. 'పెళ్లిచూపుల రోజున నన్ను డాబాపైకి తీసుకెళ్లి నదురు బెదురులేకుండా శృంగారం గురించి సరసం గురించి పసపోసిన చిలకలాగ మాట్లాడిన రాధికేనా ఇప్పుడేమీ తెలియని ముద్దరాల్లా కనబడుతోంది?' అనుకున్నాడు మాధవరావు. ఆరోజు డాబా పిట్టగోడమీద కూర్చుని తనవైపు కొంటెచూపులు చూస్తూ 'మీరు స్త్రీ దేవతల మీది ఇన్ని స్తోత్రాల గురించి చెప్పారు గదా! మీ ప్రణయదేవతని స్తోత్రం చేస్తున్నట్టు ఓ సరసమైన శ్లోకం చెప్పకూడదూ!' అంటూ తనని అడిగిన రాధిక చిలిపి ప్రశ్న గుర్తొచ్చింది మాధవరావుకి. చటుక్కున పాన్పు దిగి ఎదురేగి-

"అశ్వత్థపత్రమాకారం దూర్వాలంకార భూషితం
కదళీఫల నైవేద్యం భగదేవీ నమోస్తుతే.."

అని తన ప్రణయదేవత అయిన రాధిక మీద సరసమైన శ్లోకం చదివి, ఆమె భుజాల చుట్టూ చెయ్యివేసి నడిపించుకుంటూ తీసుకొచ్చి పూలపాన్పుమీద తన పక్కన కూర్చోబెట్టుకుని గులాబీరేకుల వంటి రాధిక చెక్కిళ్లపైన, దొండపండంటి పెదవులపైన ముద్దుల ముద్రలు వేస్తూ, "పెళ్లిచూపులరోజున నా ప్రణయదేవత మీద ఓ సరసమైన శ్లోకం చెప్పమని చిలిపి ప్రశ్న అడిగావు నన్ను. అదిప్పుడు చెప్పను. ఆరోజు రాత్రి ఆ సరసమైన శ్లోకంతోనే నా ప్రణయదేవతని ఆహ్వానిస్తానని అప్పుడు నీకు చెప్పాను కదా! ఇప్పుడు శ్లోకం బాగుందా, రాధికా?" అన్నాడు ఆమె చెవిలో గుసగుసగా.

సంస్కృతంలో విద్వాన్ శిరోమణి చదువుకుని పాసయిన రాధిక ఆ శ్లోకం యొక్క భావం అర్థం చేసుకుని "ఛీ పొండి! మీరు మరీ చిలిపి వాళ్లయిపోతున్నారు" అంటూ సిగ్గుల మొగ్గ అయిపోయి అతడి గుండెలపైన మొహం దాచేసుకుంది రాధిక.

చటుక్కున ఆమె చేతిలో పాలగ్లాసందుకుని, రాధిక పెదవులకి తాకిస్తూ "ఈ పాలలో నీ అధరామృతం కాస్త చిందించు, రాధికా! అమృతపానం చేసి ధన్యుడనౌతాను!" అన్నాడు చిలిపిగా మాధవరావు.

"పెళ్లిచూపులరోజున మీమాటలు విని మీరు పూజారులా, దేవీ భక్తులా అని ఏమేమో అనుకున్నాను గానీ, రసికులే!" అని కిలకిల నవ్వుతూ, గులాబీ రేకుల వంటి పెదవులతో అలవోకగా ఒకసారి చవిచూసి పాలగ్లాసుని మాధవరావు చేతికందించింది.

క్షీరసాగర మథనంలో వచ్చిన అమృత కలశాన్నందుకున్న దేవతల్లాగ వాళ్లిద్దరూ చెరి సగం పాలు పంచుకుని ఒకరి కౌగిట్లో ఒకరు కరిగిపోతూ పూలపాన్పుపైన ఒరిగిపోయారు. ఆ పూపుకి, పందిరిమంచం చుట్టూ నాజూగ్గా కట్టిన పూలమాలల్లో పుష్పాలన్నీ వాళ్లిద్దరి మీద జలజలమని వర్షంలాగా రాలిపోయాయి.

ఆ సుందర దృశ్యాన్ని కిటికీలోంచి తొంగిచూస్తున్న చందమామ ఇక ఇక్కడ చూస్తూ మనం నిల్చోవడం భావ్యం కాదనుకుని, మబ్బుల పరదాల మాటుకి తప్పుకున్నాడు. ■